కనిపించేదే అందమని అనుకున్న అతను కనిపించని అందాన్ని ఎలా తెలుసుకున్నాడు?




# అందానికి అటు ఇటు

డియర్ సుధాకర్—

నీకో శుభవార్త నామేరేజ్ ఫిక్స్ అయింది. వధువు నీకు తెల్సు. మీ క్లాస్‌మేట్ సునంద. వచ్చేనెల ఇరవైన పెళ్ళి. ముందే నీకు రాస్తున్నాను — మళ్ళీ శలవు దొరక లేదు లాంటి సాకులు చెప్పడానికి వీల్లేకుండా! సాధ్యమైనంత ముందే రా...

రాజారావ్

ఉత్తరం చదవగానే కోపంతో వళ్ళు వేడెక్కి పోయింది...!

రాజారావ్‌కి పెళ్ళి కుదరడం కాదు నాకు అంత కోపం కలగించడానికి కారణం... పెళ్ళికూతురు సునంద కావడం!

'సునందా! నీకిక ఆనందమే లేకుండా చేస్తాను చూడు!!' కోపంగా నాలో నేనే గొణుక్కున్నాను.

నేను మనసారా ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని అడిగినప్పుడు నిర్మొహమాటంగా 'నో' చెప్పినప్పుడే ఆమె మీదున్న సదభిప్రాయమంతా పోయింది. మనసంతా వ్యతిరేకతతో నిండి పోయింది.

రాజారావ్ బాంక్‌లో ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. ఒక్కడే కొడుకు... బాగా డబ్బున్న కుంటుంబానికి చెందినవాడు... అందుకే అతనితో సంబంధాన్ని కలుపుకోడానికి అర్రులు చాస్తున్నారు.

నన్ను కాదనీ వాడి కోసం పరుగెడుతున్న సునందకి గుణపాఠం చెప్పితీరాలి. దృఢ నిశ్చయాని కొచ్చాను.

ఎలా చేస్తే బావుంటుందా అని మనసు పరిపరి విధాల ఆలోచించ సాగింది.

రాజారావ్ వాళ్ళ వూరు పెద్ద దూరమేమీ కాదు. కాబట్టి పర్సనల్‌గా


CHALAM.

వెళ్ళి సునంద కారెక్టర్ మంచిది కాదని చెప్పి సంబంధాన్ని చెడగొట్టాలని నిర్ణయించుకున్నాను.

ఆ ఆలోచన రావడమే ఆలస్యం బయల్దేరాను.

* * *

రైలు రావడానికి పది నిముషాలుపైనే టైముంది.

రాజారావ్‌కి సునంద గురించి ఎలా చెబితే పూర్తి ఏహ్య భావం కలుగుతుందా అని ఆలోచిస్తూ ప్లాట్ ఫారమ్ మీద అటు ఇటు తిరగసాగాను.

హఠాత్తుగా ప్లాట్ ఫారం మీద అడుగు పెట్టిన వాళ్ళని చూడగానే ఆశ్చర్యపోయాను.

రాణి....!

ఆ పక్కనతను ఆమె భర్తే అయి వుంటాడు!.

వెంటనే రాణి మీద జాలేసింది.

నాభార్య కావాలని కలలుగన్న ఆమె చివ రికి అతనికి చిక్కిందన్నమాట! అందమే కాదు ఎటువంటి ఆకర్షణా ఏకోశానా లేదు అతన్లో. మరి ఏమి చూసి అతన్ని చేసుకుందో రాణి!! జాలేసింది.

"హల్లో సుధాకర్ గారు.." నవ్వుతూ దగ్గర కొచ్చింది.

నేను పలకరింపుగా నవ్వాను.

"మీరు సికింద్రాబాద్‌లోనే వుంటు న్నారా?" అడిగిందామె.

"హైద్రాబాద్‌లో వుంటున్నాను. అర్జంటుగా వరంగల్ వెళ్ళాల్సి బయల్దేరాను... మరి మీరో?"

"మేము ఎక్కడికీ వెళ్ళడంలేదు. ఇప్పుడొచ్చే బండిలో చుట్టాలు వస్తున్నారు. వాళ్ళని ఇంటికి తీసుకు వెళ్దామని.. అన్నట్టు ఈయన్ని పరిచయం చేయలేదు మా శ్రీవారు. హెచెమ్టీలో పని చేస్తున్నారు. ఈయన సుధాకర్....?"

"బ్యాంక్‌లో క్లార్క్‌గా పని చేస్తున్నాను" ఆమె మాటల్ని పూర్తి చేసాను.

గుడ్లప్పగించి చూడడం తప్ప అతనేమీ, మాట్లాడడం లేదు. ఇద్దరం కాలేజీ జీవితాన్ని అప్పటి స్నేహితుల్ని నెమరు వేసుకో సాగాం.

పది నిముషాలు పది సెకండ్లలా గడిచి పోయాయి. వాళ్ళెదురు చూస్తున్నా బండికి గంట కొట్టారు.

రాణిలో అప్పటి చలాకితనం ఏమాత్రం తగ్గలేదు. పైపెచ్చు అప్పుడు కనిపించని అందాలు ఆమెలో ఇప్పుడు కనిపించ సాగాయి. తెలివి తక్కువగా రాణిని చెయ్యి జారుచుకున్నానేమోనని కూడా ఆలోచించసాగాను.

రాణి నాకు దక్కలేదన్న బాధకన్నా అతని పాలిట బడ్డదే అన్న బాధ ఎక్కువ అయింది. రాణి కన్నా అందగత్తె అని సునంద కోసం వువ్విళ్ళూరాను. ఆమె అంతకన్న అందం కోసం పాకులాడింది. కోరుకున్న అందం ఎవరికీ దొరకలేదు.

సునంద మీదున్న మోజుతో రాణిని కాదన్నాను. నామీద కోపంతో ఆమె ఇతన్ని చేసుకోలేదు కదా! ఒక్క క్షణం అనుమానం వేసింది.

అయి వుండదు. నా మీద కోపముంటే ఇంత బాగా మాట్లాడేదా! అసలు గుర్తు

పట్టనట్లే నటించేది! నా అనుమానాన్ని నేనే నివృత్తి చేసుకున్నాను.

"ఏమిటండీ! మేమిలా మాట్లాడుకుంటుంటే మీరు ఒక్క మాట కూడా మాట్లాడరు..!" చిరు కోపాన్ని ప్రదర్శించింది రాణి.

"మీ మాటల్ని వింటున్నా.." నవ్వాడతను.

నవ్వితే రాణి అందం విజృంభిస్తుంది. కానీ ఇతను నవ్వితే మరింత వికృతంగా అనిపిస్తున్నాడు!

భార్య భర్తలలో ఎంత లేడా!

'ఐ పిటీ యు రాణీ...!' అందంలేదు... చొరవ లేదు... సరదాగా నాల్గు కబుర్లు చెప్పలేడు.. అతనితో ఎలా కాపురం చేస్తున్నావో...! రాణి మీద జాలితో మనసంతా నిండి పోయింది.


ఇంతలో పెద్ద శబ్దం చేస్తూ బండి ప్లాట్ ఫారమ్ మీదకి వచ్చేసింది. ప్లాట్ ఫారమ్ మీద కూడా సందడి పెరిగింది.

"అరుగో.. ఆ కంపార్ట్‌మెంట్లో వున్నారు... నేవెళ్ళి వాళ్ళను తీసుకొస్తాను. నువ్వు ఇక్కడే నిలబడి సుధాకర్ గారితో మాట్లాడుతుండు.." గబగబా ముందుకు కదిలాడు రాణి భర్త.

రాణిని ఓదార్చాలి ఎలా..? అసలు ఎలా మొదలు పెడితే బావుంటుంది...

"వాళ్ళ మామయ్య కూతురు వస్తుంది.. అదీ సంబరం.." ముందు రాణి మాట్లాడింది.

ఈ అందగాడికి మామ కూతురు కూడా వుందా? నవ్వొచ్చింది నాకు.



"చిన్నప్పుడే ఆ పిల్లకి తల్లి తండ్రి పోయారు. వీళ్ళింట్లోనే పెరిగింది. మా మామగారు వాళ్ళకి ఆమెనే కోడలుగా చేసుకోవాలని ఎంతో వుండేదిట..."

మరి చేసుకోవలసింది. మధ్య నీగొంతెందుకు కోసారు? ఆమె ధోరణిలో ఆమె చెప్పుకు పోతోంది. నాకు మాత్రం అతని మీద మొదటి నుంచీ సదభిప్రాయం కలగటం లేదు.

"ఆమె ఈయన్ని చేసుకోనని ఖండితంగా చెప్పేసిందట.. అంతే కాకుండా మరెవర్నో ప్రేమిస్తున్నట్లు కూడా చెప్పిందట...

ఆమె ధైర్యానికి అందరూ ఆశ్చర్యపోయారు.. మా మామగారు వాళ్ళయితే ఆమెను తెగ తిట్టారట. ఆఖరికి ఈయనే దగ్గరుండి వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిపించారు... ఈ కాలంలో ఇంత మంచి మనసు ఎంత మందికుంటుంది చెప్పండి" రాణి మాటల్లో గర్వం కనిపించ సాగింది.

నీలో అంతమంచి తనముందా? అని ఆమె నిలదీస్తున్నట్లనిపించింది.

ఇన్నాళ్ళూ తమింట్లో వుండి నిన్ను చేసుకోనని ఖచ్చితంగా చెప్పిన ఆ పిల్ల పెళ్ళి కోరిన వాడితో జరిపించిన అతనికి, నన్ను కాదన్న పిల్ల భవిష్యత్తుని నాశనం చెయ్యాలని బయల్దేరిన నాకు ఎంత తేడా!

ఇంత వరకూ నేనూ చాలా గొప్పవాణ్ణని, అతను వట్టి వెధవని విర్రవీగాను. అందం లేకపోయినా అంతకన్నా గొప్ప మనసుంది అతనికి! బయటకి అందంగా కనిపించినా భయంకరమైన మనసునాది!

నాలాంటి వాడి సొత్తు కాకుండా అంత మంచి భర్తని దక్కించుకున్న రాణి చాలా అదృష్టవంతురాలు!

నా ఆలోచనల్లో రాణి భర్త వాళ్ళు అక్కడికి వచ్చింది కూడా గమనించలేదు. 'మీరు వూరు నుంచీ రాగానే తప్పకుండా మా ఇంటికి రావాలి...' మరీ మరీ చెప్పాడతను. అతనంత అభిమానం చూపిస్తున్న కొద్దీ నాకు సిగ్గు వేయసాగింది.

"అలాగే..." అని నాదగ్గర మాట తీసుకున్న తర్వాతే వచ్చిన అతిథులతో అతను ముందుకి అడుగు వేసాడు.

అతను వెళ్తున్న దిక్కే చూస్తూ అలా ఎంత సేపు నిలబడ్డానో నాకే తెలియదు. ఎనౌన్సర్ మాటల్తో ఈ లోకంలోకి వచ్చాను.

"విజయవాడ వెళ్ళే ఎక్స్ప్రెస్ రెండో నెంబరు ప్లాట్ ఫారమ్ మీదకి కొన్ని క్షణాల్లో వచ్చును..."

రకరకాల ఆలోచనలు ఒక్క సారిగా నా మెదడుని వూపేసాయి.

చటుక్కున తేరుకుని స్టేషన్ బయటకి బయల్దేరాను.

వరంగల్ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నాను. రాజారావ్ రాసినట్టు పెళ్ళికి కొద్దిగా ముందుగానే వెళ్ళేది. ఇప్పుడు కాదు!

రాణి భర్త నా కళ్ళు తెరిపించాడు లేకపోతే ఓ పిల్ల జీవితాన్ని నాశనం చేసేవాణ్ణి! మనిషికి కావలసింది శారీరక అందం కాదు — మానసిక అందం!

థాంక్యూ జంటిల్ మన్ థాంక్యూ. మనసులోనే అతనికి కృతజ్ఞతలు చెప్పుకుని రూమ్ వేపు బయల్దేరాను. *